కథానిక

# కలుషిత హృదయం

గన్నిశెట్టి వెంకటేశ్వరరావు

మనూ విచారిస్తూ కూర్చున్నాడు. డాక్టరు గోపీచందు అతనిని ఓదారుస్తున్నాడు, 'విచారించకు మధూ నా శక్తంతా ధారపోసి నీ అనూని బ్రతికిస్తాను.' మధూ నిట్టూర్చాడు. 'నా కాశలేదు డాక్టర్! నా అనూ యింకా నాకు దక్కుతుందటారా? నన్ను భ్రమింప చేస్తున్నారు మీరు. 'అనూ' నా ప్రేమజ్యోతి, నా జీవిత సౌభాగ్యం. అటువంటి నా ఆశాజ్యోతిని నేను నా స్వహస్తాలతో, ఆర్పివేశాను. నా జీవిత సౌభాగ్యాన్ని పెంపొందించుకొనే దానికి మారుగా, నాకై నేనే నాశనం చేసుకొన్నాను. లాభం లేదు డాక్టర్! నా ఆరాధ్యదేవి నాపై కోపగించింది. వెయ్యిజన్మలెత్తినా, ఆమె నాకింక లభ్యంకాదు. ఏనాడైతే నా తుచ్ఛ సౌఖ్యాల కోసరం. ఆమె పవిత్రాత్మను కలుషితం చేశానో, ఆనాడే ఆమె నాకు దూరమయింది. నా వాంఛలకోసరం, ఆమె తన కోర్కెలను త్యజించింది. ఆ అమరమూర్తిని నాశనం చేసిన పాపిని నేను డాక్టర్. నా పాపానికి తగిన శిక్షను విధిస్తున్నాడు భగవానుడు. చేతులు కాలాక ఆకులు పట్టుకొని, లాభంలేదు. మీరెన్ని చెప్పినా మీ మాటలయందు విశ్వాసము చూపలేను డాక్టర్! క్షమించండి' ఉన్మత్తుని పగిది, మాట్లాడకపోతున్నాడు మధు. అతని ధోరణి చూస్తూంటే, అతడు ఉన్మత్తుడవటానికి, చాలా దగ్గరలో వున్నాడని తెలుసుకొన్నాడు డాక్టర్. కాని అతడు మాట్లాడే మాటలలో, ఏదో అంతరార్థం ఇమిడివున్నట్లు స్పష్టమవుతుంది. ఎక్కువగా మాట్లాడినకొలది అతని పరిస్థితి విషమిస్తుందని తెలిసికూడా, ఆ రహస్యాన్ని తెలిసికొనేందుకుగాను, అతణ్ణి తిరిగి మాటలలోనికి దింపాడు గోపీచంద్.

'మధూ నీవు చెప్పేది నా కర్థం కావటం లేదు. 'అనూ' చేతులారా చేసుకొన్న పాపానికి నీవిలా కారణభూతుడ వయ్యావో తెలియకుండా వుంది.'

'కాదు డాక్టర్ నేను నిజం చెబుతున్నాను. దీనిలో 'అనూ' తప్పు రవ్వంతకూడా లేదు. ఈ తప్పంతా ఈ పాపి మధూది అంటే, మీరు నమ్మలేకుండా వున్నారు. నా మాటలు చివరవరకు వింటేనేగాని, యథార్థాన్ని గ్రహించలేరు. అయితే వద్దు డాక్టర్. ఆ విషయాలన్నీ చెప్పి, నాలో రేగు దుఃఖాగ్నిని మరింత ప్రజ్వరిల్లేలాగు చేయలేను.'

'నీవు మరొకసారి చెబుదువుగాని విశ్రాంతి తీసుకో' అంటూ లేచాడు చంద్.

'కాదు డాక్టర్! నేను పొరబడ్డాను, నే నొనర్చిన పాపమును విచారించి, తగిన శిక్ష విధించనున్నాడు కదూ! భగవానుడు. ఆ విచారణలో శిక్షను తప్పించుకోటానికే గదూ, నేను మిమ్మల్ని నా తరపున ప్లీడరుగా నియమించుకొన్నాను. మీరు సాంతం జరిగిన విషయాన్ని వినందే నా తరఫున ఎలా వాదిస్తారు. వినండి డాక్టర్! వినాలి మీరు. తప్పకుండా వినాలి, వినండి చెబుతున్నాను'

అతని ప్రేలాపన వింటూంటే, చందూకు, జాలి నవ్వూ రెండు కలిగాయి. చిన్న నవ్వు నవ్వాడు.

'ఏం? డాక్టర్ నవ్వుతున్నారు నా ప్రేలాపన వింటూంటే నవ్వవస్తూంది కదూ మీకు. అవును, యిప్పుడు నవ్వుతున్నారు కాని నా అపరాధాన్ని వింటే నన్ను దూషిస్తారు. అవును దూషించాల్సిందే డాక్టర్. నే నొనర్చిన పాపానికి, సరియైన శిక్షను విధించటానికి, యమధర్మరాజు చాలడు డాక్టర్. నా నేర విచారణకు. మరొక నూతన నరకం సృష్టింపబడాలి. డాక్టర్ వినండి. నా నేరాన్ని శ్రద్ధగా వినండి.'

అతని ధోరణి కద్దుకగిలి, ఆతణ్ణి నిరుత్సాహ

జరపటం యిష్టంలేక, 'సరే వినిపించు' అన్నాడూ చందూ.

ఒక గ్లాసు మంచినీరు త్రాగిన తర్వాత మొదలుపెట్టాడు మధూ:

'అది 'అనూ'ని పెళ్ళాడిన మొదటి సంవత్సరం. రెండు సంవత్సరాల పైచిలుకగా, ఆమెతో స్వర్గీయానందాన్ని అనుభవించాను. మా జీవితం లోకానికి ఆదర్శప్రాయంగా వుండాలని ఆశించాను. నిజంగా డాక్టరు! నా అనూ నన్ను ప్రేమించినంతగా, లోకంలో యే భార్య తన భర్తను ప్రేమించదు. ఆమె నాకు భార్యగా దొరకటం పూర్వజన్మకృతఫలమే అనుకొన్నాను. మా ప్రేమజీవితం చిరస్థాయిగా నిల్వాలని, రోజూ భగవంతుణ్ణి ప్రార్థించేవాడిని. నా అనూ కూడా అలాగే ప్రార్థించేది. ఆనాడు జీవితంలో గొప్ప మార్పు వచ్చింది. డాబామీద పండువెన్నెల్లో నేను నా అనూ ప్రక్కన శయనించి, ఏవో కలలు కంటున్నాను.

'మధూ నీకొక శుభవార్త' అంది అనూ. 'ఏమిటో చెప్పు' మన్నాను. కాస్సేపు నన్నూరించింతర్వాత చెప్పింది.

'నా పిచ్చిమధూ! ఇంకా తెలియలేదా నీకు? నీవు కొద్దిరోజుల్లో తండ్రివి కాబోతున్నావు' అని సిగ్గుతో తలను నా హృదయంలో దాచుకొంది. ఆమాటతో నా హృదయం, ఆనందవీచికలతో వూగిపోతు దడకొంది. నిజంగా యీ లోకంలో మంచి యోగిని హృదయముంటే, ఆ విధంగానే వూగిపోయుండేది కాని మానవత్వం నశించిన నాకలా జరుగలేదు. నా హృదయంలో మానవ సహజమయిన ఆనందానికి మారు, యీర్ష్యాగ్ని ప్రజ్వరిల్లింది. స్వార్థమనే రాక్షసత్వం నాలో ప్రవేశించింది. ఆ రాక్షసత్వానికి నిదర్శనమే, ఈనాటి నా అనూ." అర్థమవుతూందా డాక్టర్! నా కర్కశ హృదయంలోనుండి వెలువడిన మాటలను వినండి. 'అనూ' సంతోషమే నా సంతోషంగా భావించే నేను ఆమాటలను నేనెలా అనగలిగానో నాకర్థం కావటంలేదు.

'అనూ నా జీవితానందానికి కప్పుడే అడ్డుకట్ట నిర్మించబడిందా?' అన్నాను. ఆశ్చర్యపోయింది అనూ.

'మధూ! నీ నోటినుండే వింటున్నానా ఈ మాటలను? నీవీవిధంగా అంటావని, కలలోనయినా అనుకోలేదు' చిన్నబుచ్చుకొంది అనూ. నా హృదయంలో యేదో చెయ్యి పెట్టి కలచినట్లుంది. నే కోరిన స్వర్గం నుండి నా ప్రాణానికి జారిపోతున్నట్లనిపించింది. నాకూ నా అనూకు మధ్య వేనవేలు పిశాచాలు అడ్డు నిలచినట్లయింది. సుఖాగ్నిలో కుమిలిపోతున్న నా యోచన. అనూ చంటిబిడ్డతో నిలచింది. అనూని దగ్గరకు తీసుకోవటానికి లేచాను. వెంటనే బిడ్డ రోదన... అనూ నన్ను వదలి వెళ్ళటం. నా ప్రేమరాశిని ఎప్పటికప్పుడే నాకు దూరం చేస్తున్నాడా చంటిబిడ్డ ... మా యిద్దరి మధ్య 'పెద్ద అగాధం... నాతల గిర్రున తిరిగింది.

వీల్లేదు 'అనూ' నీవు తల్లివి కావటానికి వీలులేదు' పెద్దగా అరచాను.

'మతిపోతూందా మధూ! నీధోరణి నాకర్థం కావటంలేదు చంకలోనికి పాపాయి ఎప్పుడు వస్తాడా అని ఎదురు చూడాల్సిన నీవు...'

'ఆగు అనూ! చంకలోనికి పాపాయి. ఆహ్హా హాహ్హా... నా ఆనంద సౌధాన్ని నిలువునా కూల్చే బిడ్డ నా ఆరాధ్యదేవివయిన నిన్ను నా నుండి వేరుజేసె చంటిబిడ్డ, ఆహ్హాహ్హా... నన్నూ నా జీవితాన్నీ అథఃపాతాళాని కణగద్రొక్కే ఆ చంటిబిడ్డ. ఆ శనిగ్రహాన్ని ఎన్నటికీ ఆహ్వానించలేను. అక్కరలేదు నన్ను సౌఖ్యదూరుణ్ణి చేసే పితృస్థానం జన్మజన్మలకు నాకక్కరలేదు.

'అనూ, ఆమాటను ఇక ఎన్నటికీ నాకు వినిపించకు. అనూ నన్ను నీనుండి వేరుజేసే నీ మాతృస్థానాన్ని త్యజించు. అనూ నన్ను కరుణించవూ!' అంటూ అనూని దగ్గరకు తీసుకొన్నాను.

డాక్టర్! ఎక్కడయినా యిటువంటి నీచుణ్ణి చూశారా మీరు? అనూ కళ్ళవెంట బాష్పబిందువులు రాలసాగాయి. ఏమి మాట్లాడలేకపోయింది.

'అనూ! చెప్పు! నా కోర్కెను తీరుస్తావుగదూ' నీ మాతృస్థానాన్ని త్యజిస్తావు గదూ!'

'మధూ! ఎంత విపరీత మనస్కుడవయ్యావు. స్త్రీ సహజమయిన మాతృస్థానాన్ని వదలుకొమ్మంటావా? నీ సౌఖ్యాలకోసరం, నా జీవి

తాన్ని బలిపెట్టానా? నా కోర్కెలు నాలోనే నశించిపోవలసిందేనా మధూ!'

ఆ మాటకు ఎంతటి పాషాణహృదయుడైనా కరిగిపోతుంది. కాని, ఈ కుచ్ఛుని గుండెలో మార్పు రాలేదు డాక్టర్! స్వార్థం నాలో గూడుకట్టింది. ఎంత ప్రయత్నించినా, ఆ స్వార్థాన్ని నాలోనుండి త్రోసివేయలేక పోయాను. 'అనూ'ని, నిరంతరానందదాయినిగా చెయ్యవలసిన నేను, ఆమెను దుఃఖసాగరంలో పడేస్తున్నానంటే నిజంగా అర్థం లేదు. నేనెంత వాస్తవికతకు దూరుణ్ణయ్యానో తెలుసుకోండి!

'తుచ్ఛమయిన నీ మాతృత్వంకోసరం, నా హృదయంలో చెలరేగే వాంఛలను నశింపజేయ్యలేను అనూ! నీ ఎడబాటు కలిగినదినం ఈ మధూ జీవితం దుఃఖపూరితంగాక తప్పదు. నిన్ను వదిలి ఒక్క నిముషం కూడా జీవించలేను. నీకు నా మీద నిజమయిన ప్రేమ వుంటే, నా ఆనందానికి అడ్డంగిలే నీ శిశువుని త్యజించు.'

'మధూ....' దుఃఖంతో కుమిలిపోతూంది అనూ హృదయం. అయినా యీ నీచుడిలో పరివర్తన కలగలేదు.

'ఇంక నాకేమీ చెప్పకు అనూ! నీ జీవితానికి శరణ్యం నీభర్తో, బిడ్డో, తేల్చు.' అని నా కఠోరనిశ్చయాన్ని వెలిబుచ్చాను. మానవత్వం నశించిన నాలో మార్పురాదన్న సంగతి గ్రహించిన అనూ, నాపై ప్రేమను నశింపజేసుకోలేని అనూ, నీచమయిన నా కోర్కెను చెల్లించేందుకు గాను, పవిత్రమయిన తన మాతృస్థానాన్ని విసర్జించటానికి నిశ్చయించింది.

ఇరువది నాలుగు గంటలలో, నా పాపకృత్యానికి తగిన ఫలిత మనుభవించాను. ఏ వేళకు నా అనూ చేత మాతృత్వాన్ని విసర్జింపజేసానో, తిరిగి అదే వేళకు, నా స్వహస్తాలతో నా దేవిని, మీ సాన్నిధ్యానికి తీసుక వచ్చాను. అంతే డాక్టర్! విన్నారు గదా ఈ పాపి జేసిన ఘోరపాతకం. వెళ్ళండి డాక్టర్! వెళ్ళండి. నా పాపాలన్నీ క్షమించి, నా అనూని బ్రతికించమని మొరపెట్టండి భగవానునితో. నా కలుషిత హృదయంతో దేవుణ్ణి ప్రార్థించలేను.' అంతే యిక చెప్పలేకపోయ్యాడు మధూ. అతని హృదయంలో తుఫాను బయలుదేరింది. అతని శరీరం తూలిపోతున్నది. ఆఖరికి, అతను మూర్ఛిల్లాడు. అతని ఉపచర్యలకోసం, ఒక నర్సును నియమించి నూపదరి వెళ్ళాను చందూ.

మధూకి తెలివి వచ్చేసరికి సాయంత్రం ఆరు గంటలయింది. కళ్ళు తెరచి చూశాడు. అతనికి చేరువలోనే దీనవదనుడయి కూర్చొని వున్న డాక్టరు కనిపించాడు

'డాక్టర్! నాతప్పు క్షమించాడా భగవానుడు? నా జీవితం ఆనందపూరిత మయ్యిందా? నా అనూ బ్రతికిందా? ఏం మాట్లాడరు? డాక్టర్.'

'మధూ! నా పది సంవత్సరాల అనుభవాన్ని వినియోగించాను నీ అనూని బ్రతికించటానికి. కాని భగవానుడు కరుణించలేదు. నా శ్రమ నిష్ఫలమయ్యింది. నీ ఆరాధ్యదేవి నీకు దూరమయ్యింది. ఇంక నీ పాపానికి పశ్చాత్తాపము లేదు.' డాక్టరు కంఠం రుద్ధమయ్యింది. నయనాలు అశ్రుపూరితాలయ్యాయి. తలవంచేశాడు.

మధూ పెద్దపెట్టున నవ్వటం మొదలుపెట్టాడు.

'అవును డాక్టర్! భగవానుడు నాకు సరియైన శిక్షనిచ్చాడు. మీరు వృథా భ్రాంతిలో పడ్డారు. నాకీశిక్ష విధిస్తాడని నాకు తెలుసు. సెలవు డాక్టర్! మీరుపడ్డ శ్రమకు ప్రతిఫలమిదిగో' అంటూ జేబులో వున్న కరెన్సీనోట్ల కట్టలను తీసి గదినిండా విరజిమ్మి, వికటాట్టహాసంతో బయలు దేరాడు మధూ. డాక్టరతన్ని వారించి.

'మధూ కొంచెం విశ్రాంతితీసుకో. నీ అనూ భౌతిక దేహాన్ని ఒక్కసారి చూచుకొందువుగాని రా!'

'అక్కరలేదు డాక్టర్! అనూ భౌతిక దేహంతో నాకు పనిలేదు. పవిత్రమయిన ఆమె ఆత్మ నాలో ప్రతిఫలిస్తూనే వుంది. నా అనూ అదిగో నన్ను పిలుస్తూంది. ఆమెను కలుసుకునేందుకే వెళుతున్నాను. డాక్టర్! నాకు సరైన శిక్ష, నే నొనర్చినది పశ్చాత్తాపములేని పాపం' అహహాహా హాహాహా హ్హా ..' వికటాట్టహాసంతో, బయలుదేరాడు మధూ. డాక్టరతణ్ణి వారించ ప్రయత్నించి విఫలుడయ్యాడు. 'అహహాహా హాహాహా ...' భయంకరమయిన మధూ నవ్వుతో, హాస్పిటల్ ఆవరణ అంతా మారుమోగింది.